# వినాయక పూజ : అంతరార్థం

**ఆస్తిక బుద్ధి పోయె; మరియాదల ధర్మము రూపుమాసె; బల్**
**నాస్తికబుద్ధి హెచ్చె; గురువన్నను శ్రద్ధయు పోయె; భక్తికిన్**
**స్వస్తి, సనాతనప్రభకు స్వస్తి వచించెడి కాలమయ్యెడిన్**
**నిస్తుల గౌరవాదరము నేలకు గోలకు వచ్చె నేటికిన్**

నేడు గణేశ్ చతుర్థి, పవిత్రమైన పర్వదినము. గ – అనగా, బుద్ధి. ణ – అనగా, విజ్ఞానము. కాబట్టి బుద్ధి, విజ్ఞానములకు అధిపతి గణపతి. జగత్తును పోషిస్తున్న గణములకు ఇతడే నాథుడు. ఈ లోకంలో అందరికీ ఒక గురువుంటాడు. కాని, గణపతికొక గురువు లేడు; తనకు తానే గురువు. సర్వులకు నాయకుడు వినాయకుడు. ఈ లోకంలో అందరూ వినాయకుణ్ణి పూజిస్తారు. కాని, వినాయకుడు ఎవ్వరినీ పూజించడు. ఎందుకంటే, ఇతనికి నాయకుడే లేడు. ఇంతేగాక, ఇతనికి మూషికవాహనుడని పేరు. అంత గొప్ప దేహము కల్గిన వినాయకుడు ఒక చిన్న మూషికముపై ఏరీతిగా సవారి చేయగలడు? అని కొందరికి సందేహం కల్గవచ్చు. ఇక్కడ మూషికమనగా ఎలుక కాదు; అజ్ఞానమనే చీకటికి చిహ్నం. ఎందుకంటే, మూషికము చీకటియందే సంచరిస్తూ ఉంటుంది. కనుక, అజ్ఞానమనే అంధకారాన్ని అణచివేసినవాడే మూషికవాహనుడు. ఇట్టి వినాయక తత్త్వమును మీరు చక్కగా గుర్తించి వర్తించినప్పుడే వినాయకపూజయొక్క ఫలితమును అందుకోవడానికి వీలౌతుంది.

*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ*
*అహంత్వాంసర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః*

ఇది భగవద్గీతలో ప్రధానమైన సూత్రము. దేహాభిమానము గలవానిని దుఃఖము వెంటాడుతూనే ఉంటుంది. దేహాభిమానమువల్లనే సంకల్పములు ఆవిర్భవిస్తాయి. కనుకనే, 'సర్వధర్మాన్ పరిత్యజ్య', ఈ దేహసంబంధమైన వాసనలను త్యజించవలసిందిగా బోధించాడు కృష్ణుడు. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించడమే దీని అంతరార్థము.

వ్యష్టి లేక సమష్టి లేదు. సమష్టి లేక సృష్టి జరుగదు. కనుక, మనం మొట్టమొదట వ్యష్టితత్త్వాన్ని గుర్తించాలి. వ్యష్టిద్వారా సమష్టిని, సమష్టిద్వారా సృష్టిని అర్థం చేసుకోవచ్చును. సృష్టిని అర్థం చేసుకున్నవాడే పరమేష్ఠిలో ఐక్యం కాగలడు. వ్యష్టి, సమష్టి, సృష్టి, పరమేష్ఠి – ఈ నాల్గు తత్త్వములూ ప్రతి వ్యక్తియందున్నాయి. వ్యష్టి స్వరూపుడు జీవుడు, సమష్టిస్వరూపుడు దేవుడు. కాబట్టి, జీవునకు, దేవునకు ఎక్కువ భేదము కనిపించదు. వ్యష్టి సమష్టితో ఏకత్వాన్ని అనుభవించినప్పుడే సృష్టిని అర్థం చేసుకోవడానికి వీలౌతుంది. వ్యష్టి, సమష్టి, సృష్టి – ఈ మూడింటికీ మూలాధారమైన పరమేష్ఠితత్త్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి. ఇదే వినాయకుని ప్రధానమైన సందేశం. గణపతి అనే పేరులో 'గ' (బుద్ధి) అనే అక్షరమునకు ఇదే సరియైన అర్థము. ఈనాటి మానవుడు వినాయకుణ్ణి పూజిస్తున్నాడే గాని, వినాయకతత్త్వాన్ని అర్థము చేసుకోవడానికి ఏమాత్రం ప్రయత్నించడం లేదు.

**చింతలే లేకున్న సంతసము లభించదు**

ఈ లోకంలో జరిగే మంచిచెడ్డలకు మూలకారణం మానవుని సంకల్పములే. మానవుడు సంకల్పవికల్పాత్మకస్వరూపుడు. సంకల్ప వికల్పములను అరికట్టుకొని సమత్వమును సాధించడమేమానవుడు చేయవలసిన ప్రధానమైన సాధన. మానవుణ్ణి నిరంతరము చింతలు వెంటాడుతూనే ఉంటాయి. చింతలేని సమయమే చిక్కదు.

*"పుట్టుట ఒక చింత, భూమినుండుట చింత,*
*సంసారమొక చింత, చావు చింత*
*బాల్యమంతయు చింత, వార్ధక్యమొక చింత*
*జీవించుటొక చింత, చెడుపు చింత*
*కర్మలన్నియు చింత, కష్టంబులొక చింత*
*సంతసమొక చింత, వింత చింత!"*

అయితే, ఈ చింతలవల్లనే తాను సంతసమును పొందగల్గుచున్నాడు. చింతలే లేకున్న మానవునికి సంతసము లభించదు. రెండు బాధలమధ్యలోనే ఆనందము లభ్యమౌతుంది. బాధలు లేకుండా ఆనందము లభించాలంటే, ఏనాటికీ సాధ్యంకాదు మానవత్వంలోనే దివ్యత్వమున్నది. మానవునిలో ఉన్న దివ్యశక్తి ఇంకెక్కడా కనిపించదు. అంతటి దివ్యశక్తిని తనయందే ఉంచుకొని మానవుడు ఉపయోగించుకోలేకపోతున్నాడు. మానవుని బుద్ధిశక్తి చాలా గొప్పది. విజ్ఞానము దానికంటే మరింత గొప్పది. ఈ రెండింటి తత్త్వమును మనము మొట్టమొదట అర్థం చేసుకోవాలి.

**కుడుములు, ఉండ్రాళ్ళ నైవేద్యం - అంతరార్థం**

ఈ పండుగరోజున అగ్నిసంస్కారము, తైలసంస్కారము లేకుండా బియ్యపుపిండిని ఆవిరిపై ఉడికించి అందులో బెల్లము, నువ్వులపిండి పెట్టి కుడుములు, ఉండ్రాళ్ళు తయారుచేసి వినాయకునికి నైవేద్యం పెడతారు. దీని అంతరార్థమేమిటి? అగ్నిసంస్కారము, తైలసంస్కారము లేకుండా తయారుచేసిన ఆహారమును భుజించేవాడు నిత్యారోగ్యాన్ని అనుభవిస్తాడు. నువ్వులు కంటిజబ్బుల నివారణకు తోడ్పడతాయి. ఆవిరిపై ఉడికిన పదార్థాలు జీర్ణశక్తిని పోషిస్తాయి. బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్‌వంటి వ్యాధులు రాకుండా కాపాడతాయి. అగ్నిసంస్కారము, తైలసంస్కారములతో కూడిన ఆహారము జీర్ణశక్తిని క్షీణింపజేసి రోగాలకు దారితీస్తుంది. కనుక, దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించాలంటే అగ్నిసంస్కారము, తైలసంస్కారము తగ్గించాలి.

ఈ భాద్రపద చతుర్థి దినమున వినాయక పూజ చేయడంవలన వినాయకుని అనుగ్రహము దండిగా, నిండుగా లభిస్తుందనే విశ్వాసము అనాదికాలమునుండి ప్రజల్లో అభివృద్ధి అవుతూ వచ్చింది. వినాయకపూజ వల్ల సకల విఘ్నములు తొలగిపోతాయి కాబట్టి, వినాయకునికి విఘ్నేశ్వరుడని పేరు. ప్రవృత్తిపరంగాను, నివృత్తి పరంగాను మేలు కలిగించేవాడు వినాయకుడు. ప్రవృత్తి దేహానికి సంబంధించినది. నివృత్తి బుద్ధికి సంబంధించినది. ప్రవృత్తి మార్పు చెందుతూ వుంటుందిగాని, నివృత్తి ఎన్నటికీ మార్పుచెందదు. కాబట్టి, సరియైన ఆహారవిహారములచేత క్రమక్రమేణ మనము దేహాభిమానమును తగ్గించుకోవాలి. మన దేహంలో గుండె ఒక్కతూరి కొట్టుకున్నప్పుడు రక్తము 12వేల మైళ్ళ దూరము ప్రయాణం చేస్తుంది. ఆహారాన్ని మితిమీరి భుజించడంవలన దేహము బరువెక్కుతుంది. దేహము బరువెక్కేకొలదీ గుండెపై ఒత్తిడి పెరిగి అది బలహీనమైపోతుంది. కాబట్టి, ఆరోగ్యమును కాపాడుకోవాలంటే మొట్ట మొదట మన ఆహారవిహారములను అదుపులో పెట్టుకోవాలి.

ఈనాడు గణపతికి గరికతో పూజ చేస్తారు. ఇది ఏవిధంగా ప్రారంభ మైంది? ఒకపర్యాయం పార్వతీపరమేశ్వరులు పాచికలాడుతూ నందిని న్యాయనిర్ణేతగా పెట్టుకున్నారు. ప్రతి పర్యాయం ఈశ్వరుడే జయించినట్లుగా నంది తలూపుతూ వచ్చాడు. పార్వతికి కోపం వచ్చింది. నంది పక్షపాత బుద్ధితో ప్రవర్తిస్తున్నాడని భావించి, "నందీ! నీవు అజీర్ణరోగంతో క్షీణించి పోదువు గాక!" అని శపించింది. అప్పుడు నంది, "తల్లీ! ఇది నేను కుత్సితముతోగాని, కుట్రతోగాని చేసినదికాదు. న్యాయముగానే వ్యవహ రించాను. ఈశ్వరసంకల్పం వజ్రసంకల్పం. తన సంకల్పబలముచేతనే ఈశ్వరుడు విజయాన్ని సాధిస్తూవచ్చాడు. ఇందులో నా దోషమేమీ లేదు. నన్ను మన్నించి శాపవిమోచనమార్గాన్ని తెలుపవలసింది", అని ప్రార్థించాడు. అప్పుడు పార్వతి శాంతించి, "నందీ! నీవు భాద్రపదచతుర్థి నాడు నీకిష్టమైన పదార్థమును వినాయకునికి అర్పితం గావించు. నీకు రోగనివారణ అవుతుంది", అని చెప్పింది. నంది గరికతో వినాయకుణ్ణి పూజించి రోగవిముక్తి పొందాడు. వినాయక పూజ సర్వులకు ఆరోగ్య భాగ్యమును అందిస్తుంది.

పెంపుడు కుక్కలు గలవారికి ఈవిషయం బాగా తెలుస్తుంది – ప్రతి వారం ఆ కుక్కల్ని పచ్చికమైదానంలో వదలిపెట్టినప్పుడు అవి తెల్లనిగరికను వెతుక్కొని తింటాయి. ఎందుకంటే, అది అజీర్ణవ్యాధిని నివారిస్తుంది.

**మనిషి ఆయుర్దాయము క్షీణించడానికి కారణం దుర్గుణాలే!**

ఈనాటి మానవుడు తన మతిని, గతిని, స్థితిని, సంపత్తిని దుర్వినియోగ పరచుకుంటూ తద్వారా తనయందున్న శక్తిని క్షీణింపజేసుకుంటున్నాడు. కామక్రోధలోభములను పెంచుకొని దుఃఖానికి గురి అవుతున్నాడు. లేత వయస్సునుండియే వాంఛలను పెంచుకుంటున్నాడు. వాంఛలకు ఒక పరిమితియే లేదు. వాంఛలు ఫలించనప్పుడు క్రోధము ప్రారంభమౌతుంది.

*కోపము కలిగినవారికి*
*ఏ పనియు ఫలింపకుండు, ఎగ్గులు కలుగున్*
*పాపపు పనులను చేయుచు*
*ఛీ! పొమ్మనిపించుకొనుట చేకూరు సుమీ!*

*తన కోపమె తన శత్రువు*
*తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ*
*తన సంతోషమె స్వర్గము*
*తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!*

ఈనాటి మానవుని ఆయుర్దాయము తరిగిపోవడానికి కారణం కామము, క్రోధము, ద్వేషము ఇత్యాది దుర్గుణములే. నూరేళ్ళు జీవించవలసిన మానవుడు 30,40 సంవత్సరాలకే ప్రాణాలను కోల్పోతున్నాడు. ఈ దుర్గుణాలను దూరంచేసుకున్నప్పుడు మానవుడు పరిపూర్ణమైన ఆయుర్దాయాన్ని అనుభవించగలడు; యాక్సిడెంట్లు జరిగినప్పటికీ ప్రాణం పోదు. తనలో ఉన్న దుర్గుణాలే 'రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్'లుగా వచ్చి మానవుణ్ణి బాధిస్తున్నాయి. కామక్రోధ ద్వేషములు మానవగుణములు కావు, అవి పశుగుణములు. పశు గుణములను తనలో ప్రవేశ పెట్టుకుంటే మానవుడుకూడా పశువై పోతాడు. "నేను పశువును కాను, నేను మనిషిని", అనే సత్యాన్ని గుర్తుంచుకున్నప్పుడు ఆ పశులక్షణాలు తనలో ప్రవేశించడానికి వీలుండదు.

**బ్రహ్మచర్యమనే పునాదిని భద్రం చేసుకోండి**

మానవజీవితం నాలుగంతస్తుల మేడవంటిది. దీనికి బ్రహ్మచర్యమే పునాది. దీనిని సరియైన స్థితిలో

కాపాడుకున్నప్పుడే గృహస్థ వానప్రస్థములు క్షేమంగా ఉంటాయి. కాని, ఈనాటి పిల్లలు బ్రహ్మచర్యమందేతమ జీవితాన్ని ముక్కాలు భాగము నాశనం చేసుకుంటున్నారు. ఐదు నిమిషాలైనా దైవాన్ని ప్రార్థించండని చెబితే క్షణమైనా తీరిక లేదంటారు. కాని, దుర్భావాలచేత, దురభ్యాసాల చేత ఎంతకాలమైనా వ్యర్థం చేస్తారు. యువకులు మొట్టమొదట బ్రహ్మచర్యమనే పునాదిని భద్రం చేసుకోవాలి. బ్రహ్మచర్య మనగా వివాహమాడకుండా ఉండటం కాదు. నిరంతరం బ్రహ్మలో చరించడమే బ్రహ్మచర్యము. మీ మనస్సులో నిరంతరం బ్రహ్మతత్త్వాన్ని స్మరిస్తూ ఉండాలి; పవిత్రతను పోషించుకోవాలి; ప్రేమతత్త్వానికి మీ జీవితాన్ని అంకితం చేయాలి. అప్పుడే మీ జీవిత భవనానికి తగిన భద్రత చేకూరుతుంది. మన కంటికి గోడలు కనిపిస్తాయి. భవనము, దాని అందచందములు కనిపిస్తాయి. కాని, పునాదిమాత్రం కనిపించదు. ఐతే, కనిపించని పునాదియే కనిపించే భవనానికి ఆధారంగా ఉంటుంది. పైన కనిపించే గోడలను, పైకప్పును ఆకర్షణీయంగా ఉండేటట్లు రూపొందిస్తారు. కాని, భూమిలో వేసే పునాది రాళ్ళకు అందచందములు అక్కర్లేదు. కాని, భవనముయొక్క భారమును మోసేవి అవే. ఈనాటి మానవుడు 'భవనము'యొక్క అందచందములకే ప్రాధాన్యత ఇస్తున్నాడు గాని, 'పునాది'యొక్క భద్రతనుగూర్చి ఏమాత్రం యోచించడం లేదు.

**భీష్మాచార్యుని ఆదర్శం**

నిరంతరము దైవచింతన చేయాలి, బ్రహ్మతత్త్వములో చరించాలి. అదే బ్రహ్మచర్యము. పూర్వకాలములో గురువును ఆచార్యుడని పిలిచేవారు. ఆచార్యుడనగా ఆచరించి బోధించేవాడని అర్థం. ఆచరించకుండా బోధించేవానిని ఉపాధ్యాయుడని పిలువవచ్చునుగాని, ఆచార్యుడని పిలువడానికి వీలుకాదు. ఉపాధ్యాయుడు పాఠాలను మాత్రం నేర్పగలడుగాని, మనోనిగ్రహానికి ఏమాత్రం తోడ్పడజాలడు. ఆచార్యుడు మాత్రమే మనోనిగ్రహానికి సంపూర్ణంగా తోడ్పడగలడు. మహాభారతంలో ద్రోణాచార్య, భీష్మాచార్యులు ప్రధానమైన పాత్రలు పోషించారు. ద్రోణుడు పాండవులకు విలువిద్య నేర్పిన గురువైతే భీష్ముడు వారి హృదయానికి గురువైనాడు. అతడు మహాజ్ఞాని. జ్ఞానమనగా ఏమిటి? గొప్పగొప్ప పుస్తకాలు చదవడం కాదు. "అద్వైత దర్శనం జ్ఞానం". ఒక్క దైవత్వమును తప్ప అన్యమును స్మరించకూడదు. దైవత్వమునకు మీ దేహేంద్రియ మనోబుద్ధులను అర్పితం చేయాలి. సర్వకర్మలను భగవత్ప్రీత్యర్థం ఆచరించాలి. ఇట్టి ఆదర్శమును అందించినవాడు భీష్మాచార్యుడు. అతడు కేవలం ఆత్మతృప్తికోసం పాటుపడ్డాడు; తన మాతృమూర్తి యొక్క ఆజ్ఞను శిరసావహించి ఆమె ప్రేమకు పాత్రుడయ్యాడు.

యుద్ధంలో అర్జునుడు వేసిన అంబులు భీష్ముని దేహమంతా నాటుకొని పోయాయి. భీష్ముడుకూడా అంబులు వేశాడు. కాని, అవి నిరపరాధియైన శ్రీకృష్ణునికి తగిలాయి. కృష్ణుని దేహమంతా రక్తసిక్తమైంది. యుద్ధంలో ఎన్నో జరుగుతుంటాయి. అక్కడ కేవలం జయాపజయములకు మాత్రమే అవకాశమున్నదిగాని, మంచి, చెడ్డ అనే విచారణకు అవకాశం లేదు. భీష్ముడు 56 దినములు శరతల్పముపై పరుండి ఉత్తరాయణ పుణ్యకాలం కోసం నిరీక్షించాడు. అన్ని రోజులూ ఒక్క చుక్కైనా నీరు త్రాగలేదు. తన అంత్యసమయంలో అర్జునుణ్ణి పిలిచి, తనకు దాహంగా ఉందని, ఒక్కసారి తన తల్లి గంగను రప్పించి తన దాహం తీర్చవలసిందని కోరాడు. ప్రాణం విడిచేముందు తన తల్లిప్రేమను, అనుగ్రహాన్ని అందుకోవాలని ఆశించాడు. అర్జునుడు ఒక అంబును తీసి భీష్ముని తలప్రక్కన నేలపై కొట్టాడు. తక్షణమే భూమినుండి గంగ రివ్వున ఎగసివచ్చి భీష్ముని నోట్లో పడింది. ఈనాడు చాలామంది 'అర్జున' అని పేరు పెట్టుకుంటారు గాని, పేరుకు తగినట్లు ప్రవర్తిస్తున్నారా? అర్జునుడంటే నిర్మలమైన చిత్తము గలవాడని అర్థం. అతనికి "అర్జున ఫల్గున పార్థ కిరీటి శ్వేతవాహన బీభత్స విజయ కృష్ణ సవ్యసాచి ధనంజయ..." మొదలైన అనేక బిరుదులున్నాయి.

శ్రీశైలక్షేత్రంలో భ్రమరాంబ, మల్లికార్జునులు కొలువుదీరి ఉన్నారు. మల్లికార్జునుడనగా ఎవరు? మల్లిక = మల్లెపూవువలె, అర్జునుడు = తెల్లనివాడు అని అర్థం. భ్రమరమనగా తుమ్మెద. మల్లికాభ్రమర శబ్ద సంయోగాన్ని బట్టి, ఈ దేవుడు సువాసనలు విరజిమ్ము మల్లెపుష్ప మనియు, దేవి, ఆ పుష్పంలో ప్రవేశించి మకరందమును గ్రోలు భ్రమరమనియు, ఆమె నిజమైన భక్తికి ప్రతీకయని గ్రహింపవలెను.

పాండవులలో అర్జునుడు చాలా గొప్పవాడు. తాను ఎవరిపైనను అనవసరంగా అంబును ప్రయోగించినవాడు కాదు. కాని, తప్పనిసరి పరిస్థితుల్లో యుద్ధంచేశాడు. కృష్ణుడు కౌరవులవద్దకు రాయబారిగా వెళుతుంటే, "కృష్ణా! నీవు సర్వజ్ఞుడవు. నీకు నేను ప్రత్యేకంగా ఏమీ చెప్పనక్కర్లేదు. యుద్ధము జరుగకుండా ఉండేటట్లు ప్రయత్నించు", అని కోరాడు. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు. పైగా మితిమీరిన పుత్రాభిమానంచేత అతనిలో విచక్షణ శూన్యమైంది. పుత్రులు చెప్పినట్లు అతను నడుచుకోవలసిందేగాని, అతను చెప్పినట్లు పుత్రులు నడుచుకోరన్న విషయం కృష్ణునికి తెలుసు. అయినప్పటికీ, తాను ధృతరాష్ట్రునివద్దకు వెళ్ళి అన్నివిధాలుగా నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. కాని, లాభం లేకపోయింది. అక్కడినుండి తిరిగి వచ్చి, "అర్జునా! నా సంధియత్నం విఫలమైంది. యుద్ధానికి సిద్ధంగా ఉండు", అని చెప్పాడు. యుద్ధంలో ఎంతమంది నిరపరాధులను చంపవలసివస్తుందో, అని అర్జునుడు విచారం వ్యక్తం చేశాడు. అప్పుడు కృష్ణుడు, "అర్జునా! యుద్ధానికి వచ్చేవారు ప్రాణాలు తీయడానికి, ప్రాణాలు వదలడానికి సిద్ధపడేవస్తారుగాని, యుద్ధాన్ని చూసిపోదామని ఎవ్వరూ రారు. కాబట్టి, అక్కడ నిరపరాధు లెవ్వరూ ఉండరు", అన్నాడు. అక్కడినుండి తాను ధర్మజునివద్దకు వెళ్ళాడు. యుద్ధమంటే ధర్మజునికి గిట్టదు. కాని, అతనుకూడా ఒప్పుకొనక తప్పలేదు. నకుల సహదేవులు చాలా గుణవంతులు. వయస్సులో చిన్నవారైనప్పటికీ వారికున్న గుణసంపత్తి మిగిలిన సోదరులకు లేదు. యుద్ధానికి సిద్ధం కమ్మని కృష్ణుడు చెప్పినప్పుడు వారు విచారించలేదు. "మా బావగారు దుర్మార్గులైన కౌరవులవద్దకు వెళ్ళి క్షేమంగా తిరిగి వచ్చారు. మాకదే చాలు", అన్నారు.

> కాలకూటమున అమృతము సృజింప వీలా
> భయద దావాగ్నిలో మల్లెపూలు వెదజల్లుట మేలా
> ముష్కరుల మ్రోల హితోక్తులు వీలా
> గుణజాల! ఏల ఈ సంధిమాటలిక గోపాలా!

అంటూ అర్జునుడు యుద్ధానికి సిద్ధమయ్యాడు. కాని, యుద్ధభూమికి వెళ్ళేటప్పటికి అతనికి ఒకవిధమైన భయం కల్గింది. యుద్ధం చేయగలనో లేదో అని కాదు; ఎందరు నిరపరాధులు మరణిస్తారో, పుత్రులను కోల్పోయిన తల్లిదండ్రులు ఎంత దుఃఖిస్తారో, అని చింతించాడు. "కృష్ణా! ఇంతమంది బంధుమిత్రులను, గురుపుత్రు లను చంపి భరించుటెట్టులో! నా కన్నులు తిరుగుచున్నవి. ఈ యుద్ధము వద్దు, ఇంటికి పోదాం", అన్నాడు. కృష్ణుడు కోపాన్ని ప్రదర్శిస్తూ, "ఛీ, పిరికిపంద! ఊరకనే ఉన్న నన్ను యుద్ధానికి పురిగొల్పి ఇప్పుడు నీవు భయపడిపోతున్నావే! అలాంటప్పుడు అసలు నీవు యుద్ధానికి ఎందుకు సిద్ధపడాలి?" అని చీవాట్లు పెట్టాడు. అతనిని కర్తవ్యోన్ముఖుణ్ణి చేయడానికి భగవద్గీతను ఉపదేశించాడు. కృష్ణునిబోధ అతని హృదయంలోకి ప్రవేశించి తగిన బలము నందించింది; అర్జునుడు యుద్ధానికి ఉపక్రమించాడు; కాని, భీష్ముని ధాటికి తట్టుకోలేక పోయాడు. అప్పుడు కృష్ణుడు అర్జునునికి ధైర్యాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో, "ఈ భీష్ముణ్ణి నేను సంహరిస్తాను", అంటూ ముందుకురికాడు. అర్జునుడు, "కృష్ణా! 'ఆయుధమును ధరింపను, యుద్ధము చేయను', అని నీవు శపథం చేశావు. ఇప్పుడు యుద్ధము చేస్తే నీవు మాట తప్పినట్లు అవుతుంది. నాకోసం నీవు మాటతప్పకూడదు", అని ప్రార్థించాడు. తనవైపు దూసుకువస్తున్న కృష్ణుణ్ణి చూసి భీష్ముడు చేతులు జోడించాడు.

కుప్పించి ఎగసిన కుండలముల కాంతి
గగన భాగంబెల్ల గప్పికొనగ
నురికిన నోర్వక యుదరంబులోనున్న
జగముల వ్రేగున జగతి కదల
జక్రంబు చేబట్టి చనుదెంచు రయమున
బైనున్న పచ్చని పటము జార
నమ్మితి నా లావు నగుబాటు సేయక
మన్నింపుమని క్రీడి మరల దిగువ
గరికి లంఘించు సింహంబు కరణి మెరసి
నేడు భీష్ముని చంపుదు నిన్ను గాతు
విడువమర్జున యనుచు మద్విశిఖవృష్టి
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు.

"నన్ను చంపుతానని వచ్చే కృష్ణపరమాత్ముడే నాకు దిక్కు", అన్నాడు. అంతటి మహాజ్ఞాని, పరమ భక్తుడు భీష్మాచార్యుడు.

ప్రేమస్వరూపులారా! రామాయణ, భాగవత, భారతములు ఎంతో పవిత్రమైన అంతరార్థములతో కూడినవి. ఈనాటి పిల్లలు పిచ్చిపిచ్చి నవలలు, కథలను చదువుతారుగాని, పవిత్రమైన మన ప్రాచీనచరిత్రలను చదవరు. ప్రాపంచికమైన కథలు మన వ్యథలను ఏమాత్రం నివారించలేవు. భగవత్కథలే మనకు దివ్యమైన మార్గము చూపిస్తాయి. His story is History. దానిని మీరు చదవాలి. మిగిలినవెన్ని చదివినా ప్రయోజనం లేదు. వినాయకుని కథ గొప్ప అంతరార్థముతోకూడినది. ఈ పండుగ రోజున విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలను వినాయకుని ఎదుటపెట్టి పూజిస్తారు. భగవత్సంబంధమైన జ్ఞానమును పొందేనిమిత్తం విద్యార్థులు వినాయకుణ్ణి పూజించాలి. వినాయక తత్త్వం చాలా విశిష్టమైనది. వినాయకునికి అనుగ్రహమే తప్ప ఆగ్రహం లేదు.

**ఆదర్శప్రాయులు మా పిల్లలు**

సత్యసాయి సెంట్రల్ ట్రస్టులో పనిచేసే మా పిల్లలు ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలనుండి ఒక ప్రత్యేకమైన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టులో చేరి వాళ్ళు అన్ని పనులూ చేస్తున్నారు. గత 30 సంవత్సరములనుండి కొందరు పెద్దలు ఇందులో బాధ్యతవహించి పనిచేస్తూవచ్చారు. ఇంతకాలం నేనుకూడా ట్రస్టుకు సంబంధించిన పనులను చూసుకుంటూ వచ్చాను. అయితే, మా పిల్లలు ఈ ఉద్యోగాల్లో చేరిన తరువాత నేను దేనినీ విచారించడం లేదు. పిల్లలు అంత చక్కగా పని చేస్తున్నారు. బుక్‌స్టాల్‌కి పోయి చూడండి, ఎకామొడేషన్ ఆఫీసుకి పోయి చూడండి... ఏ ఆఫీసుకైనా పోయి చూడండి... అందరూ చక్కని ఆదర్శమునందిస్తున్నారు. మంచిమాటలు మాట్లాడతారు, ప్రేమతో మాట్లాడతారు. ఎవరిపైనా కోపం ప్రదర్శించరు. Help Ever, Hurt Never (ఎల్లప్పుడు సహాయమే చేయాలి, ఎవ్వరినీ బాధించకూడదు) అనే దివ్యసూక్తిని పిల్లలు అక్షరాలా ఆచరణలో పెడుతున్నారు. ఈ రోజు మధ్యాహ్నం జరిగే కార్యక్రమంలో వాళ్ళు మీకెన్నో మంచివిషయాలను చెబుతారు. నిజంగా, మా పిల్లలు చెప్పే విషయాలను ప్రతి వ్యక్తి వినాలి. అవి స్వానుభవంతో చెప్పే మాటలు. మా పిల్లలు తమాషాకైనా అసత్యమాడరు. చూడడానికి పిల్లలవలె కనిపిస్తారుగాని, మా ట్రస్టులో అన్ని పనులూ వాళ్ళే చేస్తున్నారు. ఈవిధంగా, మా పిల్లలు అభివృద్ధికి రావడం నాకెంతో ఆనందాన్ని కల్గిస్తోంది. ఎవరేది అడిగినప్పటికీ వాళ్ళు మంచి తెలివితేటలతో చక్కని జవాబు ఇస్తుంటారు. మా సెంట్రల్ ట్రస్టు అకౌంట్స్‌ను ఐదుమంది పిల్లలు చూసుకుంటున్నారు. బుక్స్ అండ్ పబ్లికేషన్స్ పనులను మరికొంతమంది పిల్లలు చూసుకుంటున్నారు. ఎక్కడేగాని, ఒక్క నయాపైస అయినా వ్యత్యాసం రాదు.

అలాంటి సత్ప్రవర్తన, సద్గుణములు, సదాచారములు మా పిల్లలయందున్నవి. ప్రశాంతినిలయంలో జరిగే కార్యక్రమాలన్నింటినీ "రేడియో సాయి గ్లోబల్ హార్మోనీ" ఛానల్‌ద్వారా ప్రపంచానికంతటికీ అందిస్తున్నది మా పిల్లలే. వాళ్ళు ఉపయోగించే భాష చాలా మంచిభాష. మధ్యాహ్నం మీరే వింటారు. వాళ్ళు ఉపయోగించే భాషను మీరుకూడా నేర్చుకోవాలి. వాళ్ళు మీ సోదరులే! అందరూ సోదర సోదరీమణులే! కాబట్టి, మీరు కూడా ఇట్టి అవకాశమును అందుకొని అభివృద్ధికి రావాలని నేను ఆశిస్తున్నాను.

**(2002 సెప్టెంబరు 10వ తేదీ ఉదయం సాయికుల్వంత్ సభామంటపంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)**